క్లుప్తంగా

ఆలోచింపజేసిన దేవిశ్రీ గీతం


ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ

సీతమ్మధార: 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదించిన వారెందరో.. పోరు బాటలో అసువులు బాసిన అమరవీరులెందరో.. వారి త్యాగం ఏమాయెను పాలకులారా.. ఆ త్యాగాలను తుంగలో తొక్కిందే మీరు.. అచ్చేదిన్ అంటే ఏమో అనుకున్నాం.. సచ్చే దినము వచ్చిందని తెలుసుకోలేకున్నాం.. మోదీ పాలనలో కేడీల రాజ్యమా.. అమ్మేటందుకు వాళ్లెవరు.. కొనేటందుకు వీళ్లెవరు? ఎవడబ్బ సొమ్మని విర్రవీగుతుండ్రు.. స్టీల్‌ప్లాంట్‌కి గనులిచ్చి విశాఖ ఉక్కును కాపాడాలి.. మనమంతా చేయి చేయి కలిపి నడవాలి' అంటూ ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ తనదైన శైలిలో ఆలపించి అందర్నీ ఆలోచింపజేశారు.

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు


టెన్త్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

సీతమ్మధార: స్థానిక ఎన్‌ఎంసీ హైస్కూల్లో 200 మంది రెగ్యులర్, 62 మంది ప్రైవేట్ విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనుండగా రెగ్యులర్ విద్యార్థులంతా అన్ని పరీక్షలకు హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు మాత్రం 55 మందే హాజరయ్యారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు చక్కని వాతావరణం కల్పించారు. ఈరోజు వరకు ఇక్కడ ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. పరీక్షలు పూర్తయిన సందర్భంగా ఎన్‌ఎంసీహెచ్ హైస్కూల్ విద్యార్థులు సందడి చేశారు.


చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలోని 24వ వార్డులో బీజేపీ నాయకులు మజ్జి ఉమామహేశ్వర రెడ్డి, దుర్గా ప్రసన్నలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ రాజు పాల్గొన్నారు. ముందుగా శ్రీ భూలోకమాత ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం పాదచారులకు మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమంలో రేసపువానిపాలెం గ్రామ అధ్యక్షుడు బేరి గురునాథ్ రెడ్డి, నక్కవానిపాలెం గ్రామ అధ్యక్షుడు కాటరాజ్ రెడ్డి, కోశాధికారి ధర్మాన గురుమూర్తి రెడ్డి, హనుమంతురావు, వార్డ్ ప్రెసిడెంట్స్, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార: నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద వైద్య ఖర్చుల కోసం ఆరుగురు లబ్ధిదారులకు రూ.4.80 లక్షల చెక్కులను ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు అందజేశారు. ఈ మేరకు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో 49, 50, 53, 55 వార్డులకు సంబంధించిన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఎవరు అనారోగ్యం పాలైనా హాస్పిటల్‌కు సంబంధించిన ఒరిజినల్ బిల్లులు పెట్టాలని కోరారు. ఇంట్లో దిగిన వారు దురుద్దేశంతో ఆస్తిని చేజిక్కించుకునే ఉదంతాలకు అడ్డుకట్ట వేసేందుకు అడ్వాన్స్‌డ్ డిక్రీ బిల్లును తదుపరి అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. దీనివల్ల ముందస్తు ఒప్పందం జరిగి, సొంత ఇల్లు కలిగిన వారికి న్యాయస్థానంలో తగిన రక్షణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నజీర్, కూటమి నేతలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

కంచరపాలెం రైతుబజారు సమాచారం...

- రైతుబజారు విస్తీర్ణం సుమారు **1.5** ఎకరాలు
- గుర్తింపు పొందిన రైతులు : **210**
- ప్రతిరోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు.. తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు
- ప్రతి మంగళవారం సెలవు
- సీసీ కెమెరాలు సంఖ్య **13/16** డీవీఆర్
- రైతుబజారులో స్టాళ్లు : **114**
- రైతుల సంఖ్య **190**
- ఉదయం రైతుల సంఖ్య **118**
- సాయంత్రం రైతుల సంఖ్య **72**
- సమాచారం కోసం: జగదీశ్వరరావు, ఎస్టేట్ అధికారి, సెల్ నంబర్ : **9490756334**

సీసీ కెమెరాల పర్యవేక్షణ	రోజుకు 3-4 వేల మందికి పైగా రాక
రైతులే వ్యాపారులు	నిర్ణీత ధరలకే సరకుల అమ్మకాలు

సూపర్.. ఈ రైతుబజార్


కూరగాయలు విక్రయిస్తున్న రైతులు


కంచరపాలెం రైతుబజారులో రద్దీ


రైతుబజారు ప్రధాన ద్వారం వద్ద ప్రైవేట్ వ్యాపారుల విక్రయాలతో రద్దీ

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజార్ వినియోగదారులతో నిత్యం కళకళలాడుతుంటుంది. జీవీఎంసీ 54వ వార్డు పరిధిలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న బీఆర్‌టీఎస్ రహదారి పరిధిలో ఈ రైతుబజారు ఏర్పాటు చేశారు. 47,48,49,54, 55, 56,57 వార్డుల్లోని ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, జ్ఞానాపురం తదితర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ 3–4 వేల మందికి పైగానే వినియోగదారులు వస్తుంటారు. ఇక్కడ తాజా కూరగాయలతో పాటు, ఇతర నిత్యావసర సరుకులు సైతం విక్రయిస్తుంటారు. రైతులతో పాటు డ్వాక్రా గ్రూప్ మహిళలు ఇక్కడ వ్యాపారం చేస్తున్నారు. పళ్లు, పూల ఉత్పత్తులు కూడా దొరుకుతాయి. గిరిజన, సూపర్ మార్కెట్, డీసీఎంఎస్, విశాఖ డెయిరీ స్టాల్స్ ఏర్పాటు చేసి తక్కువ ధరకే సరుకులు విక్రయిస్తున్నారు.

ధరల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకే..

ఈ మార్కెట్‌కు వచ్చే వినియోగదారులకు కూరగాయలు, నిత్యావసర సరుకులు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. డిమాండ్ ఉన్న రోజుల్లో ఉల్లిపాయలు, టమాటా సబ్సిడీ ధరలకు అందిస్తున్నారు. ఈ రైతుబజారు నిర్వహణ ద్వారా సుమారు రూ.1.85 లక్షల వరకు ఆదాయం వస్తోంది. రైతుబజార్ ఎస్టేట్ అధికారి (ఈవో), అటెండర్, స్కావెంజర్ల వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులు పోనూ ఆదాయం పెద్దగా మిగిలేది ఏమీ ఉండదనే చెప్పాలి. బయటి మార్కెట్లలో కృత్రిమ కొరత, ధరల దోపిడీ వంటి వాటికి వినియోగదారులు గురి కాకుండా ఈ రైతుబజారు నిర్వహిస్తున్నారు.

రైతులే వ్యాపారులు..

కంచరపాలెం రైతుబజారులో 190 మంది రైతులున్నారు. వీరిలో సుమారు 160 మందికి పైగా రైతు బజార్‌కు కూరగాయలు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. గుర్తింపు పొందిన రైతులు ఎటువంటి అద్దె చెల్లించాల్సిన అవసరం లేదు. వారు పండించిన పంటను బజార్‌కు తీసుకొచ్చి నేరుగా వారే వినియోగదారులకు విక్రయించుకునేలా ఇక్కడ ఏర్పాట్లు చేశారు. వినియోగదారులకు నాణ్యమైన, సరైన తూకంతో కూరగాయలు అందేలా మార్కెటింగ్ శాఖాధికారులు పర్యవేక్షణ చేస్తుంటారు. చక్కటి పార్కింగ్‌తో వినియోగదారుల రాకపోకలు చేసేందుకు వీలుగా రైతుబజారుకు రెండు ప్రధాన ద్వారాలు ఏర్పాటు చేశారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో..



దొంగతనాలు అరికట్టేందుకు, వినియోగదారులతో వ్యాపారుల నడవడి, వాహనాల పార్కింగ్ పర్యవేక్షణ వంటి వాటి కోసం సీసీ కెమెరాలు వినియోగిస్తున్నారు. చిల్లర దొంగతనాలు జరిగేటప్పుడు సీసీ కెమెరాల వల్ల చక్కటి ఫలితం కలుగుతోంది. రాత్రి సమయంలో రైతులు తెచ్చే కూరగాయాల మూటలు గతంలో దొంగించేవారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో రైతుబజారుకు భద్రత కల్పించారు. ఈ రైతుబజారుకు పెద్దగా సెక్యూరిటీ లేదనే చెప్పాలి.

పార్కింగ్‌కు అడ్డంకిగా కంటైనర్..

గిరిజన ఉత్పత్తుల కోసం ఏర్పాటు చేసిన భారీ కంటైనర్ రైతుబజారులో పార్కింగ్‌కి అడ్డంకిగా మారింది. పార్కింగ్ ప్రాంతంలో కంటైనర్‌ను ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నారు. ఇది ఎక్కువ స్థలం ఆక్రమించడంతో వినియోగదారు, వ్యాపారులకు ఇబ్బందిగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన గిరిజన ఉత్పత్తుల కంటైనర్

తాజా కూరగాయలు దొరుకుతాయి..



ఉదయం, సాయంత్రం ఈ రైతుబజారులో తాజా కూరగాయలు దొరుకుతాయి. అధికారులు నిర్ణయించిన ధరకే రైతులు కూరగాయలు విక్రయిస్తున్నారు. పట్టీలోని ధరలకే కూరగాయలు లభిస్తున్నాయి. ప్రధాన ద్వారం వద్ద ప్రైవేటు వ్యక్తుల విక్రయాలతో పార్కింగ్‌కు ఇబ్బందిగా ఉంది. దళారుల బెడద లేదు.

– జ్యోతి, వినియోగదారురాలు, సిద్ధార్థనగర్, ఊర్వశి కూడలి

పార్కింగ్‌తో ఇబ్బంది..



రైతుబజారుకు గతంలో పార్కింగ్‌కు కావలసిన స్థలం ఉండేది. గిరిజన ఉత్పత్తుల విక్రయాల కోసం భారీ కంటైనర్ ఏర్పాటు చేశారు. ఇది ఎవరి ప్రయోజనం కోసం ఏర్పాటు చేశారో గాని పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించింది. పార్కింగ్ చేయడానికి వినియోగదారులకు ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు పర్యవేక్షించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి.

– గంటా నాయుడు, వినియోగదారుడు, భవానీగార్డెన్స్, మర్రిపాలెం.

మా పంట మేమే విక్రయిస్తున్నాం..

ఈ రైతుబజారులో దుకాణాల నిర్వహణకు గుర్తింపు కార్డులు మంజూరు చేశారు. మా పొలంలో పండించిన పంట మేమే తీసుకొచ్చి విక్రయిస్తున్నాం. అన్ని ఖర్చులు పోనూ రోజుకు సుమారు రూ. 900లకు పైనే మిగులుతోంది. గతంలో దళారులకు అమ్ముకోవాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి బాధ లేదు. ఇక్కడి ఏర్పాట్లు బాగున్నాయి. వినియోగదారుల సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల మాకు బేరాలు బాగున్నాయి.

– దేవి, రైతు, కంచరపాలెం రైతుబజార్

సౌకర్యాలు కల్పిస్తున్నాం..

వినియోగదారుల అవసరాల మేరకు కూరగాయలు, నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. ఇటీవల రైతుబజారులో ధరల పట్టిక నుంచి టాయిలెట్లు, పార్కింగ్, పరిశుభ్రతపై నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం. పచ్చదనం కోసం రైతుబజారులో మొక్కలు నాటుతున్నాం. నిర్ణీత ధరలకు విక్రయించని రైతులపై చర్యలు తీసుకుంటున్నాం. సీసీ కెమెరాల ఏర్పాటుతో రైతులు, వినియోగదారులకు మేలు జరుగుతుంది.

– జగదీశ్వరరావు, ఎస్టేట్ అధికారి, కంచరపాలెం రైతుబజార్.

స్త్రీల పాటల్లో సీతాదేవిపై ప్రసంగం


ప్రసంగిస్తున్న ఆచార్య డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి

సీతంపేట: శ్రీలలితాపీఠంలో జరుగుతున్న వసంత నవరాత్రుల్లో భాగంగా గాయత్రీ కళాశాల విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి రామాయణంలో స్త్రీల పాటల్లో సీతాదేవి అను అంశంపై ప్రసంగించారు. సీతా రావణుల సంభాషణ, స్త్రీల వేవిళ్లు మొదలైన పాటలు పాడి జానపదుల విశ్వాసాలు, వారు సీతాదేవిని తమలో ఒకరిగా భావించుకోవడం, వారికి ఆమెపై గల ఆపేక్ష మొదలైన విషయాలను వివరించారు. ఇతర రామాయణాల కంటే జానపద రామాయణాల ప్రత్యేకతను, స్త్రీల స్వభావాన్ని, జానపద కవయిత్రులు భావించిన తీరును చక్కగా వివరించారు. అనంతరం పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ చేతుల మీదుగా ప్రసంగకర్తను సత్కరించారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్.ఎం. రాంప్రసాద్

సీతమ్మధార: సీతమ్మధార: ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా మంగళవారం ఎన్ఎంసీహెచ్ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ సూచనల మేరకు ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలోకి వచ్చిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు డి.రాంప్రసాద్ ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రియదర్శిని, భారతి, భవాని, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



సినిమా పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట: శీతల్ స్వర ఈవెంట్స్ ఆధ్వర్యంలో ద్వారకా నగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను రంజింపజేసింది. పల్లా బాబ్జి, వెంకట్, లక్ష్మీ సరస్వతి ఆధ్వర్యంలో గాయనీగాయకులు పాత సినిమాల్లోని హిట్ సాంగ్స్ ఆలపించి అలరించారు. గాయనీగాయకులు వెంకటేష్ మాస్టారు, కృష్ణంరాజు, ఎ.నర్సింగ్, భాగ్యలక్ష్మి, మాధురి, కృష్ణవేణి పాటలు పాడి వీనుల విందు చేశారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగావకాశాలు


సాంకేతిక విద్యపై అవగాహన కల్పిస్తున్న గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్: పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ విద్యను అభ్యసించడం వల్ల తక్షణ ఉద్యోగావకాశాలు లభిస్తాయని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. కాలేజీ సమీపంలోని శ్రీశాంతి నికేతన్ ఉన్నత పాఠశాలలో సాంకేతిక విద్యపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. పాలిటెక్నిక్ విద్యను అభ్యసించి 18 ఏళ్లు దాటిన విద్యార్థులకు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో మంచి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. పాలిటెక్నిక్ కోర్సులు చదవడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా బీటెక్‌లో నేరుగా రెండో సంవత్సరంలో చేరి ఉన్నత విద్యను కొనసాగించుకోవచ్చన్నారు. కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో చేరిన విద్యార్థులు నూరు శాతం క్యాంపస్ ఉద్యోగాలు సాధించిన విషయాన్ని ఆయన వివరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో పాలిసెట్‌కు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నామని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో తమ సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఉత్కల్ దివస్


ఉత్కల్ దివస్‌లో పాల్గొన్న ప్రముఖులు


పాటలు పాడుతున్న కళాకారులు

బీచ్ రోడ్డు: ఒడిశా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దసపల్లా హిల్స్‌లోని ప్రాంగణంలో వేడుకలు జరిపారు. 1936 ఏప్రిల్ 1న భాషా ప్రాతిపదికన ఒడిశా రాష్ట్రం ఏర్పాటు జరిగిన సందర్భాన్ని పురస్కరించుకుని ఒడిశా వాసులంతా ఈ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఒడియా ఫుడ్ ఫెస్టివల్, హ్యాండ్లూమ్ ఫెస్టివల్‌ను కేంద్ర ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ డాక్టర్ రాజేంద్ర కుమార్ ప్రారంభించారు. ఒడిశా ప్రత్యేక వంటకాలైన కాకరా, చెనాపోడా, దహి బారా, గుగుని, మాల్పువా వంటివి ప్రదర్శించారు. సంప్రదాయ చేనేత ఉత్పత్తులను తిలకించి ప్రశంసించారు. ఒడిశా ప్రాంత ప్రముఖులైన మధుసూదన్ దాస్, గోపబంధు దాస్, కృష్ణ చంద్ర గజపతి మహారాజ్ వంటి వ్యక్తులకు ఈ సందర్భంగా నివాళులర్పించారు. తూర్పు కోస్తా రైల్వే అదనపు డివిజనల్ మేనేజర్ మనోజ్ కుమార్ సాహు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఆర్ సాహు సంకలనం చేసిన సాహిత్య వార్షిక పత్రిక 'సమాజ్ అరుణియా'ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉత్కల్ సమాజ్ ప్రధాన కార్యదర్శి బిమల్ కుమార్ మహంత, సమాజ్ అధ్యక్షుడు జితేంద్ర నాయక్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న భవన నిర్మాణ కార్మికులు


మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

దాబాగార్డెన్స్: ఎండలు మండిపోతున్నాయి. పాదచారులు.. కార్మికులు.. కర్షకులు దాహార్తికి అల్లాడుతున్నారు. ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ ఎక్కడా అటువంటి చర్యలు కానరావడం లేదు. ప్రభుత్వం విస్మరించినా.. మాకూ మానవత్వం ఉందంటూ భవన నిర్మాణ కార్మికులు సింగ్ హోటల్ జంక్షన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు మంచి నీటికి అల్లాడుతున్నారు. మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని భవన నిర్మాణ సంఘం నాయకుడు సిమ్మునాయుడు ఆర్థిక సాయంతో మంగళవారం సింగ్ హోటల్ జంక్షన్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. సంఘం మహిళా నాయకురాలు లక్ష్మి చేతుల మీదుగా పలువురికి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘం నాయకుడు కె. నర్సింగరావు మాట్లాడుతూ వేసవి తాపానికి దాహం తీర్చిన వాడే నిజమైన మానవతా వాదని భవన నిర్మాణ కార్మికులు నిరూపించుకున్నారని కొనియాడారు.

శిథిలావస్థలో క్రైం పోలీస్‌స్టేషన్


పెచ్చులూడిపోతున్న ద్వారకా క్రైం స్టేషన్ శ్లాబు

సీతమ్మధార: ద్వారకా క్రైం పోలీస్‌స్టేషన్ శ్లాబు పెచ్చులూడిపోతుండడంతో ఎప్పుడు ఎవరి మీద పడతాయోనని సిబ్బంది, ఫిర్యాదుదారులు భయాందోళనలు చెందుతున్నారు. అప్పటి పోలీస్ కమిషనర్ మహేష్‌చంద్ర లడ్డా ఆధ్వర్యంలో ద్వారకా పోలీస్‌స్టేషన్‌కు మరమ్మతులు చేయించారు. తర్వాత ద్వారకా లా అండ్ ఆర్డర్‌కు వచ్చిన సీఐలు అడపాదడపా మరమ్మతులు చేయించారు. గతంలో ప్లాస్టింగ్‌లు ఊడిపోయే పరిస్థితి నెలకొంది. ఈ స్టేషన్ క్రైం పోలీసులు శ్లాబ్ కిందే విధులు నిర్వహిస్తుంటారు. అలాగే ఫిర్యాదుదారులు వచ్చి అక్కడే కూర్చుంటారు. జరగరానిది జరిగితే తల పగలడం ఖాయం. ఈ శ్లాబ్ పెచ్చులూడి ఐరన్ రాడ్లు బయటికి వచ్చాయి. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాలని సిబ్బంది, ఫిర్యాదుదారులు కోరుతున్నారు.

అలరించిన సంకీర్తన రామకథా గానం


గీతాలు ఆలపిస్తున్న శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీకి చెందిన విద్యార్థులు సంకీర్తన రామకథా గానంతో అలరించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని శ్రీ వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులచే సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంకీర్తన రామకథా గానంతో ఆకట్టుకున్నారు. 'బ్రహ్మమొక్కటే..', 'కొండలలో నెలకొన్న కోనేటి రాయడు..' వంటి భక్తిగీతాలు ఆలపించి అలరించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు వారిని సత్కరించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి


డీఆర్ఎం కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: అరకు రైల్వే కేకే లైన్‌లో పనిచేస్తున్న పెట్రోలింగ్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కేకే లైన్‌లో పనిచేస్తున్న 56 మంది గిరిజనులను ఎటువంటి నోటీసు ఇవ్వకుండా అక్రమంగా తొలగించారని, ఇది చట్టవిరుద్ధమని రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే బోర్డు ప్రకటించిన జీవో ప్రకారం జీతాలు చెల్లించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను అడిగినా వారు పట్టించుకోవడం లేదని, వెంటనే వీరిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ రైల్వే ఏడీఆర్‌ఎం లేబర్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అరకు, బొర్రా, టైడా, శివలింగపురం స్టేషన్ల నుంచి యూనియన్ నాయకులు కె.సన్యాసిరావు, గిరిజన సంఘం నాయకులు చిట్టిబాబు, దామోదర్, కృష్ణ, వెంకటరమణ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ రైతు బజార్‌ను వినూత్నంగా తీర్చిదిద్దాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్


రైతులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జేసీ మయూర్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ రైతు బజార్‌ను మరింత వినూత్నంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సూచించారు. నగర పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం మధ్యాహ్నం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌తో కలిసి ఎంవీపీ కాలనీ రైతు బజార్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత రైతు బజార్ ప్రాంగణాన్ని పరిశీలించిన ఆయన రైతులకు, వినియోగదారులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. బజార్‌లో స్టాల్స్ నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు రైతులతో ముచ్చటించారు. కూరగాయలు విక్రయిస్తున్న రైతుల స్టాల్స్ వద్దకు వెళ్లి ఏఏ గ్రామాల నుంచి, ఎంత దూరం నుంచి రైతు బజార్‌కు వస్తున్నారు, ప్రస్తుతం ఎలాంటి కూరగాయలు పండిస్తున్నారు, ధరలు లాభదాయకంగా ఉంటున్నాయా, ఆయా ఉత్పత్తుల కొనుగోళ్లకు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారా వంటి వివరాలను తెలుసుకున్నారు. గిరిజన ప్రాంతాల రైతులతో మాట్లాడగా ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చి వారంలో 4 రోజులు విక్రయాలు చేసుకుంటున్నామని, రాత్రిపూట బస చేసేందుకు ఎంవీపీ రైతు బజార్‌లో ప్రత్యేక వసతి సదుపాయం అందుబాటులో ఉందని తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడుతూ విశాఖలో అతిపెద్ద రైతు బజార్‌గా ఉన్న ఎంవీపీ రైతు బజార్‌ను మరింత వినూత్నంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. రైతులు, వినియోగదారులకు మరిన్ని మెరుగైన సదుపాయాలు అందించే విధంగా ప్రణాళికలు రచించాలని సూచించారు.